# కొంగల దేముడు

ఒకనాడు, చిక్కిపోయిన ఒకానొక బక్క కొంగ చెరువు గట్టున ఒంటికాలిమీద నిలబడి బగవంతుణ్ని ఉద్దేశించి ఈ విధంగా ప్రార్థించిందిట.

"దేవా ఆరుదినాలనుంచీ
ఒక్కగా నొక్క చచ్చు పుచ్చు
చేపైనా దొరక్క ఆకలితో నను
అలమటించి పోతున్నాను. నేను
దీనుణ్ని హీనుణ్ని కాని
పాపిని మాత్రం కాను. ఈ దినం
నాకు ఏ చేపనైనా సరే ఎలా
గైనా సరే ప్రసాదించి నీ ఈ
భక్తుణ్ని రక్షించు, దేవ దేవా!
దేవా! దేవా!"

అని పాపమా బక్కచిక్కిన బొక్కికొంగ భగవంతుణ్ణి ప్రార్థించిందట.

★ ★ ★

బెదురుతూ మనసంతా చెదిరిపోయిన ఓ చిరుచేప చెరువులో ఓమూల నిలబడి దేవదేవుణ్ని ఆ దినం దీనాతి దీనంగా ఈ విధంగా వేడుకొందిట.

"దేవుఁడా! రావుఁడా కొంగల
భయానికి నా గుండెలు బద్దలవుతు
న్నాయి. నా తల్లీ తండ్రేకాదు, మా
తల్లులు తండ్రులు మా బిడ్డలు
పాపలు అందరం కొంగలకి ఆహు
తై పోతున్నాం. మేం గంటకి వె
య్యి మందిమి పుడితే అరగంట
కి వెయ్యిమందిమి కొంగల కడు
పుల్లోకి పోతున్నాం. ప్రభూ ప్రభూ!
ఈ కొంగల బారినుంచి మమ్మల్ని
కాపాడవా ప్రభూ!"

అని పాపమా చిరుచేప చెరువు బురదనీటిలో వేడి నిట్టూర్పులు విడుస్తూ భగవంతుడ్ని వేడుకొందిట.

అపుడు ఆ చిరుచేప ప్రార్థన విన్న మరొక చేప (వంద వలల్నీ మూడువందల ముక్కుల్నీ తప్పించుకు వచ్చిన చురుకు చేప) వికటంగా నవ్వి ఈ విధంగా ఆ చిరుచేపతో చెప్పిందట.

"ఒసే చిరుచేపా! ఓసీ
నా వెర్రిచేపా! కొంగల్ని
పుట్టించినవాడు చేపల్ని ఎలా రక్షి
స్తాడనుకున్నావే? కొంగల దేవుఁడు
దొంగల దేఁవుఁడు కాడా?
అటువంటివాడు మనల్ని ఎన్నటికీ రక్షిం
చడు, రక్షించడు, రక్షించడు.
ఇది ముమ్మాటికీ నిజం! నా
మాట నమ్ము!"

అని వికటంగా నవ్వి వేదాంతిలా చెప్పిందట ఆ చురుకు చేప. అయితే -

ఆ మరొకచేప చురుకు మాటల్ని ఆ చిరుచేప నమ్మడానికి పాపమా చిరుచేపకి అవకాశం లేకపోయిందట. ఎందుచేతనంటే; ఆ మాటల్ని పూర్తిగా వినేలోపున ఆ చిన్నారి చిరుచేప భగవంతుణ్నే ప్రార్థించిన బక్కకొంగకి భోజనంగా మారిపోయిందట.

★ ★ ★

సంస్కృత దైవం తెలుగు దెయ్యం ఎవరి ప్రార్థనలు వింటాడో ఎవరివి వినడో ఎవడికి తెలుసు? కాని, కొంగలు కొంగలే, చేపలు చేపలేనని చేపలు తెలుసుకొంటే - బతుకు బురదనీటిలో చావుదారి తప్పించుకొందికి, బతుకుబాట తెలుసుకొందికి - చేపకాపాటి చిరుజ్ఞానం ఈ పాటికి చాలు.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, సెప్టెంబర్ 1972*